సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు
విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మదనపల్లె మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజరెడ్డి అన్నారు. -8లో



వరద పీడిత గ్రామాల్లో వేగంగా ఇళ్ల నిర్మాణం
వరద పీడిత గ్రామాల్లో వేగంగా పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని జేసీ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1300	రూ.1520
రెండోరకం	రూ.1080	రూ.1280



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 396 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	502	510
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 216.22 కిలోలు

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణ

కలికిరి: ఉర్దూ అకాడమీ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ (డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్) ఇస్తామని కలికిరి ఉర్దూ అకాడమి ట్రైనింగ్ కేంద్రం ఇన్‌చార్జ్ నాజియా అంజుమ్ తెలిపారు. 10వ తరగతి అర్హత కలిగిన మైనారిటీ యువతీ, యువకులు అర్హులని.. ఈ నెల 17వ తేదీ వరకు ఆసక్తి కలిగిన వారు పేర్లు నమోదు చేసుకోచ్చన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, పూర్తి చేసుకున్న వారికి ధృవీకరణ పత్రం అందజేస్తామన్నారు. అలాగే ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పనివేళల్లో 9581321179 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

6న రాష్ట్రస్థాయి సమావేశం

మదనపల్లె: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 6న నెల్లూరులోని అంబేద్కర్‌భవన్‌లో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ చీఫ్ కో–ఆర్డినేటర్ గుజ్జల ఈశ్వరయ్య తెలిపారు. రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉపాధ్యాయుల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందన్నారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రస్థాయి సమావేశంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

8, 9న తిరుత్తణికి ప్రత్యేక బస్సులు



మదనపల్లె సిటీ: ఆడికృత్తిక పురస్కరించుకుని తిరుత్తణికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ -2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ఉదయం 5.30, 6.00 గంటలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. మదనపల్లెలో బయలుదేరి పొన్నై స్వర్ణ వినాయస్వామి గుడి దర్శనం తరువాత తిరుత్తణి సుబ్రమణ్యస్వామి దర్శనం ఉంటుందన్నారు. అక్కడి నుంచి షోలింగర్‌లోని యోగ నరసింహస్వామి గుడి దర్శనం ఉంటుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


పటిష్టంగా అమలు చేయాలి



కుటుంబ వైద్యుల విధానాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య

కేవీపల్లె: కుటుంబ వైద్యుల విధానం పటిష్టంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొండయ్య అన్నారు. గురువారం మండలంలోని గర్నిమిట్ట పీహెచ్‌సీ పరిధిలో మిన్నంరెడ్డిగారిపల్లెలో 104 వాహనం ద్వారా నిర్వహిస్తున్న కుటుంబ వైద్యుల విధానాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిష్టర్లు, మందుల నిల్వ, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, గర్భవతులు, బాలింతల నమోదు, రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తుల వివరాలు, ఈ–సంజీవిని నమోదు, అందిస్తున్న సేవలు పరిశీలించారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్యామల, హెచ్ఈ బలరామరాజు, ఆరోగ్య విస్తరణాధికారి కృష్ణయ్య పాల్గొన్నారు.

నూతన ఎంపిక



షేక్ మహమ్మద్ ఇసాక్ సాహెబ్

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఖాజీ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా కడప నగరానికి చెందిన షేక్ మహమ్మద్ ఇసాక్ సాహెబ్ ఎంపికయ్యారు. గురువారం తిరుపతిలోని మసీద్ అబుబకర్ షాదీఖానాలో నిర్వహించిన 26 జిల్లాల సమావేశంలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్‌గా సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి సాహెబ్, సలహాదారుగా జలీల్ సాహెబ్, వైస్ ప్రెసిడెంట్‌గా రెహమాన్ సాబ్, జాయింట్ సెక్రటరీగా అబ్దుల్ రెహమాన్‌లను ఎన్నుకున్నారు.

148 పోస్టులకు గ్రీన్‌సిగ్నల్

వైవీయూ: రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాలు, ట్రిపుల్‌ఐటీల్లో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో విశ్వవిద్యాలయ వర్గాల్లో ఆనందం నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 2635 అధ్యాపక పోస్టులు విశ్వవిద్యాలయాల్లో, 660 పోస్టులు ట్రిపుల్‌ఐటీల్లో మొత్తం మీద 3295 పోస్టులకు నోటిఫికేషన్ జారీచేసేందుకు రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా యోగి వేమన విశ్వవిద్యాలయంలో 31 ప్రొఫెసర్ పోస్టులు, 54 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, 63 అసిస్టెంట్ ప్రొఫెసర్‌లతో మొత్తం మీద 148 పోస్టులకు గ్రీన్‌సిగ్నల్ లభించినట్లు విశ్వవిద్యాలయ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, వైవీయూలో చివరిసారిగా 2013లో నియామక నోటిఫికేషన్ ద్వారా ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేశారు.

అభివృద్ధి.. ఘనం

- 1953లో కడప ఎయిర్‌పోర్టుకు వాయుదూత్‌గా నామకరణం
- 2007లో తొలి అడుగులు
- ప్రస్తుతం ఐదు విమానాల రాకపోకలు



కడప ఎయిర్‌పోర్టు ముఖ ద్వారం



కడప సిటీ : కడపలో 1953 నుంచి విమానాశ్రయం ఉన్నప్పటికీ సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండేవి. అన్ని సౌకర్యాలతో విమానాశ్రయం నిర్మించాలని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రూ. 33 కోట్లను ఒకే విడతగా విడుదల చేశారు. 1060 ఎకరాల్లో నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. రెండు విడతల్లో పనులను చేపట్టారు. ఆయన మరణానంతరం పనుల్లో జాప్యం జరగడంతో 2015 నాటికి కడప ఎయిర్‌పోర్టు కార్యరూపం దాల్చింది. అప్పటి నుంచి విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. 1953లో కేవలం 669.5 ఎకరాల విస్తీర్ణంలో దీనిని నిర్మించారు. 1980లో వాయుదూత్ అనే పేరిట కడప నుంచి హైదరాబాదుకు కొంతకాలం పాటు విమాన సర్వీసులు నడిచాయి. తర్వాత రెండు దశాబ్దాలపాటు నిరుపయోగంగా పడి ఉన్న విమానాశ్రయాన్ని విస్తరించే ప్రయత్నాన్ని దివంగత వైఎస్సార్ ప్రారంభించారు. విస్తరణ మొదటి విడత పనులకు రూ. 21 కోట్లతో 2008 జూన్‌లో చేపట్టారు. 2009 డిసెంబరుకు పనులు పూర్తయ్యాయి. ఆరు వేల అడుగుల రన్‌వే, ట్యాక్సీ తోపాటు 1060 ఎకరాల పరిధికి 11 కిలో మీటర్ల మేర ప్రహరీ నిర్మించారు. 2010లో రూ. 13 కోట్లతో టెర్మినల్ బిల్డింగ్, ఏటీసీ (ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్), పవర్ హౌస్, లింక్ రోడ్లు, కారు పార్కింగ్, సివిల్, ఎలక్ట్రికల్ పనులను చేపట్టారు. 2011లో పూర్తి కావాల్సి ఉన్నా సాంకేతిక కారణాలతో పనులు ఆటకెక్కాయి. తర్వాత మరికొన్నేళ్ల తర్వాత పనులు పూర్తయ్యాయి. ప్రారంభంలో ఎయిర్ పెగాసిస్ విమాన సంస్థ వారానికి మూడు రోజులు మాత్రం బెంగళూరు–కడప సర్వీసు మాత్రం నడిపింది.తర్వాత ట్రూజెట్ విమాన సంస్థ రాకపోకలు కొనసాగించగా, 2022 మార్చి నుంచి ఇండిగో విమాన సర్వీసులు రాకపోకలు ప్రారంభించి, ప్రస్తుతం ఐదు సర్వీసులను నడుపుతోంది.

భారీ భద్రత

కడప విమానాశ్రయానికి 24 గంటలు భారీ భద్రతను ప్రభుత్వం కల్పించింది. 1100 ఎకరాలు విస్తీర్ణం కాగా, 11 కిలోమీటర్ల మేర ప్రహరీ నిర్మించారు. ప్రహరీ చుట్టూ ఏడు టవర్లను ఏర్పాటు చేయగా, అందులో భద్రతా సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహిస్తూ ఉంటారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

- ప్రస్తుతం కడప ఎయిర్‌పోర్టు నుంచి ఐదు విమాన సర్వీసులు నడుస్తున్నాయి. ఇండిగో సంస్థ వీటిని నడుపుతోంది. చెన్నై–కడప, విజయవాడ–కడప, హైదరాబాదు–కడప, బెంగుళూరు–కడప, విశాఖపట్టణం–కడప సర్వీసులు నడుస్తున్నాయి.

ఎయిర్‌పోర్టుకు దివంగత వైఎస్సార్ కృషి

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కడప విమానాశ్రయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఆయన హయాంలోనే కడప ఎయిర్‌పోర్టుకు తొలి అడుగులు పడ్డాయి. భూ సేకరణ చేయడమే కాకుండా నిధులు కూడా కేటాయించి తోడ్పాటు అందించారు. 2007లో ఈ విమానాశ్రయానికి తొలి అడుగులు పడగా, 2015 నాటికి అందుబాటులోకి వచ్చింది. ఆయన మరణం తర్వాత వచ్చిన పాలకులు నిర్లక్ష్యం చేయడంతో ఆలస్యమైంది. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ చూపి మరో 50 ఎకరాలు కేటాయించారు. దీంతో ప్రస్తుతం ఎయిర్‌పోర్టు విస్తీర్ణం 1100 ఎకరాలకు చేరింది. నైట్ ల్యాండింగ్‌కు సంబంధించిన అనుమతులు కూడా మార్చిలోనే వచ్చాయి. నైట్ ల్యాండింగ్‌కు సంబంధించి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పలుమార్లు సంబంధిత కేంద్ర మంత్రిని కలిసి విన్నవించడం కూడా జరిగింది.

- కడప విమానాశ్రయం వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కాకుంటే కలగానే మిగిలేది. 1953లో విమానాశ్రయం ఇక్కడ ఉన్నప్పటికీ 1980లో వాయుదూత్ పేరిట అరకొరగా కడప నుంచి హైదరాబాదుకు మాత్రమే సర్వీసు ఉండేది. 2015లో ఎయిర్ పెగాసిస్ విమాన సంస్థ వారానికి మూడు రోజులు బెంగళూరు–కడప సర్వీసులను నడిపింది. తర్వాత 2021 వరకు ట్రూజెట్ విమాన సంస్థ విమాన సర్వీసులు ఇక్కడి నుంచి నడిచాయి. ప్రస్తుతం ఇండిగో విమాన సంస్థ ఐదు సర్వీసులను నడుపుతోంది.

బ్యాడ్మింటన్ సంబరం ప్రారంభం

- తొలిరోజు ఉత్సాహంగా సాగిన పోటీలు
- 120 క్వాలిఫైయింగ్ మ్యాచ్‌ల నిర్వహణ



బ్యాడ్మింటన్ సంఘం జాయింట్ సెక్రటరీ చిన్నప్పకు నివాళులర్పిస్తున్న బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని పి.వి.ఆర్. స్పోర్ట్స్ ఎరీనా వేదికగా ఆంధ్రప్రదేశ్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2023 ప్రారంభమైంది. టోర్నమెంట్‌లో భాగంగా తొలిరోజు నిర్వహించిన క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లను జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ అనంతరం ఇంత భారీస్థాయిలో మెగా టోర్నమెంట్‌కు వైఎస్‌ఆర్ కడప జిల్లా ఆతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి టోర్నీలు క్రీడాకారులకు ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. జిలానీబాషా మాట్లాడుతూ ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలిరోజు క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు, రెండోరోజు శుక్రవారం నుంచి మెయిన్‌డ్రా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాలు, అకాడమీల నుంచి విచ్చేసిన క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లా బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, కోశాధికారి నాగరాజు, పి.వి.ఆర్. స్పోర్ట్స్ ఎరీనా అధినేత విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో రాణించడం ద్వారా నేషనల్ గేమ్స్‌లో పాల్గొనే ఏపీ జట్టుకు ప్రాతనిధ్యం వహించే అవకాశం లభిస్తుందని తెలిపారు. కావున పూర్తిస్థాయి సామర్థ్యాలతో ఆడాలని సూచించారు. శుక్రవారం సాయంత్రం ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లను వారు ప్రారంభించారు. ఉదయం నుంచి ప్రారంభమైన ఈ మ్యాచ్‌లు రాత్రి వరకు సాగాయి. సింగిల్స్, డబుల్స్ పురుషులు, మహిళల విభాగాల్లో దాదాపు 120పైగా మ్యాచ్‌ల్లో క్రీడాకారులు తలపడ్డారు.కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శంకర్‌రెడ్డి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ సంయుక్త కార్యదర్శికి నివాళి..

జిల్లా బ్యాడ్మింటన్ సంఘంలో కీలకంగా వ్యవహరిస్తూ జిల్లా జాయింట్ సెక్రటరీగా పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన పి. చిన్నప్పకు బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు నివాళులర్పించారు. స్టేడియంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



బ్యాడ్మింటన్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

పంట కోత ప్రయోగంపై అవగాహన కల్పించాలి

రాయచోటి టౌన్ : పంట కోత ప్రయోగం వల్ల ఎలాంటి లాభాలు కలుగుతాయో రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రనాయక్ అన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో జిల్లా కలెక్టర్ కార్యాయంలోని స్పందన హాల్‌లో డాక్టర్ వైఎస్సార్ పంట భీమా/ పీఎం యఫ్‌బీవై పై సహాయ వ్యవసాయశాఖ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, మండల ఉద్యానశాఖ అధికారులు, డివిజనల్ డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారులు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారులకు పంట కోత ప్రయోగాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పంట కోత ప్రయోగాల నిర్వహించి, వాటి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 2023–2024 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసిన పంట వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని స్టాటిస్టికల్ అధికారులు తెలియజేశారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు మాట్లాడారు.

రూ.75 కోట్లతో విద్యుత్ సౌకర్యం

తిరుపతి ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ ఎం.కృష్ణారెడ్డి

పీలేరు రూరల్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రూ.75 కోట్లతో జగనన్న కాలనీలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తిరుపతి ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ ఎం.కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఏపీఐఐసీ లేఅవుట్ ఫేస్ 1, 2, 3లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు హౌసింగ్ లబ్ధిదారులకు 56 వేల విద్యుత్ మీటర్లను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. లేఅవుట్‌లో 1075 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాగా, లోటల్టేజీ సమస్య అధిగమించేందుకు జిల్లాలో 33 విద్యుత్ సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఎం.మునీంద్ర, ఏడీ సుధాకర్, సర్పంచ్ హబీబ్‌బాషా, వైస్ ఎంపీపీ ఎస్.వి.చలపతి తదితరులు పాల్గొన్నారు.



జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ ఎం.కృష్ణారెడ్డి

నాడు కోతలు.. నేడు కూతలు

హంద్రీ-నీవా ప్రాజెక్టును అడుగడుగునా అడ్డుకున్న చంద్రబాబు

- 1997లో 5.5 టీఎంసీల తాగునీటి పథకంగా మార్చేసిన వైనం
- అస్మదీయులకు వందల కోట్ల దోపిడీ
- వైఎస్‌ఆర్ వల్లే హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టు కల సాకారం
- జగన్ ప్రభుత్వం రాకతో భారీ పథకాలు
- నేడు జిల్లాలో చంద్రబాబు పర్యటన

బి.కొత్తకోట: హంద్రీనీవా సుజలస్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్) సాగు, తాగునీటి ప్రాజెక్టు నిర్మాణం తన ఘనతే అని పదేపదే చెబుతున్న మాజీ సీఎం చంద్రబాబు పనులు చేపట్టకుండా నిలువునా ముంచింది ఆయనే అని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. 14 ఏళ్లు సీఎంగా పనులపై ఏనాడు శ్రద్ధ చూపని ఆయన శుక్రవారం అన్నమయ్యజిల్లా పర్యటనకు వస్తున్నారు. ఈ సందర్భంగా జాతీయరహదారిపై వెళుతూ బి.కొత్తకోట మండలంలోని బండారువారిపల్లె, కోటావూరు పంచాయతీలమీదుగా సాగుతున్న హంద్రీ–నీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువను పరిశీలిస్తారని స్థానిక టీడీపీ నాయకులు తెలిపారు. 2014–19 మధ్యకాలంలో కాంట్రాక్టర్లకు అడ్డంగా వందలకోట్లు దోచిపెట్టి, ప్రాజెక్టు రైతుల నోట్లు కొట్టేలా జీవోలిచ్చింది మరచిపోయిన చంద్రబాబు..దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో తవ్వించిన పుంగనూరు కాలువలను, మదనపల్లె సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులను సందర్శించి ఇది నా ఘనత అని చెప్పుకునే కుయుక్తులకు సిద్ధమయ్యారు. 1989 అసెంబ్లీ ఎన్నికల కోసం పురుడుపోసుకున్న హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టుకు అడ్డంకులు, ఆటంకాలు... ఆ ఎన్నికల్లో ఎన్టీఆర్ ఓటమిపాలవ్వడంతో ఈ పథకం ముందుకు సాగలేదు.అప్పటి ప్రతిపాదన ప్రకారం శ్రీశైలం నుంచి 40 టీఎంసీల మిగులు కృష్ణా జలాలను తరలించి ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరుజిల్లాల్లో 6,02,500 ఎకరాలకు సాగునీరు, 40 లక్షల జనాభాకు తాగునీరు అందించాలన్నది లక్ష్యం. అప్పటి నిర్మాణ వ్యయ అంచనా రూ.1,478.74 కోట్లు. రాయలసీమ వరప్రసాదినిగా పేరున్న ప్రాజెక్టు రూపకల్పన, ప్రకటనతో రైతుల్లో ఆశలు చిగురించాయి. 1991లో కాంగ్రెస్ పాలనలో మదన పల్లె, చిత్తూరు, కడప, గుంతకల్లు, కర్నూలు డివిజన్లు, మదనపల్లె, అనంతపురం, కర్నూలు సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటై, సర్వేలు మొదలైనా పనులు ప్రారంభంకాలేదు.1995లో చంద్రబాబు సీఎం అయ్యాక ఈ ప్రాజెక్టుకు అడుగడుగునా చంద్రగ్రహణం పట్టింది. పనులు మొదలుపెట్టకపోగా ఎన్నికల్లో ఓట్లు తెచ్చే సాధనంగా మార్చుకున్నారు. ప్రాజెక్టును చేపట్టకుండా ఆదిలోనే వదిలించుకునేందుకు చంద్రబాబు చేయని ప్రయత్నంలేదు, తీసుకోని చర్యలేదు.



హంద్రీనీవా రెండోదశ పనులకు 2006లో మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించిన పైలాన్ (ఫైల్)



2015లో కురబలకోట మండలం అంగళ్లులో హంద్రీ-నీవా కాలువపై బస్సులో నిద్రించిన సీఎం చంద్రబాబు (ఫైల్)

ప్రాజెక్టు ఎత్తివేతకు అభిప్రాయ సేకరణ


1997లో ప్రాజెక్టును తాగునీటి పథకంగా మార్చేసిన చంద్రబాబు హంద్రీనీవా ప్రాజెక్టును ఎత్తివేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. 2000లో ప్రాజెక్టును శాశ్వతంగా భూస్థాపితం చేసేందుకు విజన్ 2020 హంద్రీనీవా సుజల స్రవంతి పథకం అభిప్రాయ సేకరణ పేరిట కరపత్రాలను పంపిణీ చేశారు.

జీవో 22తో బాబు వెన్నుపోటు

వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాలువ పనులు పూర్తి చేయించగా, రైతుల పొలాల్లోకి పంట కాలువలను తవ్వే పనిని కాంట్రాక్టర్లు పూర్తి చేయలేదు. కాంట్రాక్టర్లు ఎకరాకు రూ.4,700తో పనులు చేస్తామని ఒప్పందం చేసుకున్నారు. 2015లో టీడీపీ ప్రభుత్వం ఎకరాకు రూ.10,500 పెంచింది.టీడీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో నంబర్ 22 కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చింది. ఈ జీవోతో చంద్రబాబు రైతుకు వెన్నుపోటు పొడిచారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రాజెక్టు రెండోదశలోని పనులను కాంట్రాక్టర్ల సంస్థల నుంచి తొలగించి అంచనాలను పెంచుకుని దోపిడీ చేసింది. 24 ప్యాకేజీల నుంచి తొలగించిన రూ. 302. 24 కోట్ల పనులకు రూ. 1,131.52 కోట్లకు పెంచుకుని దోచుకున్నారు.

కేటాయింపులు మొక్కుబడి

2014–15లో రూ.416 కోట్ల కేటాయించగా రూ.165.69 కోట్లు, 2015–16లో రూ.211 కోట్లు కేటాయించగా రూ.198.83 కోట్లు ఖర్చు చేశారు. 2016–17లో రూ.483 కోట్లు, 2017–18లో రూ.479.20 కోట్లు, 2018–19లో రూ.524.31 కోట్లు కేటాయించారు. కాగా సీఎంగా చంద్రబాబు అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం అంగళ్లలో 2015 మే 7న హంద్రీనీవా పుంగనూరు ఉపకాలువపై బస్సులో నిద్రించారు. ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పేందుకు నిద్రించానని చెప్పే ఆయన తర్వాత ప్రాజెక్టు గురించి పట్టించుకోలేదు.



- మదనపల్లె పట్టణ ప్రజల దాహం తీర్చేందుకు దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్ రెడ్డి హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా మదనపల్లె సమీపంలో 59 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యంతో చిప్పిలి, 131 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యంతో గుంటిపల్లె సమ్మర్‌స్టోరేజి ట్యాంకులను నిర్మించారు. పుంగనూరు ఉపకాలువ నుంచి కృష్ణా జలాలు తరలించేలా రూపకల్పన చేశారు. అయితే చిప్పిలి నిర్మాణం తానే చేశానని చంద్రబాబు చెప్పుకోవడం దారుణం.
- 2019 ఎన్నికల్లో ప్రయోజనం పొందడం కోసం చంద్రబాబు 2019 జనవరి 21న జిల్లాలోకి హంద్రీనీవా పుంగనూరు ఉపకాలువ ద్వారా కష్ణా జలాలను తరలించారు. ఇది తమ ఘనతగా చెప్పుకొన్నారు.

వైఎస్‌ఆర్‌తో జీవం

2004లో వైఎస్సార్ ముఖ్యమంత్రి అయ్యాక హంద్రీ–నీవాప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టారు. 2005లో మొదటిదశలో రూ.2,772 కోట్లతో కర్నూలు, అనంతపురం జిల్లాలో, రెండోదశలో రూ.4,076 కోట్లతో చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల్లో రెండోదశ పనులు చేపట్టేలా రెండు జీవోలతో నిధులు మంజూరు చేశారు. ప్రాజెక్టుద్వారా రాయలసీమలో 6.68లక్షల ఎకరాలకు సాగునీరు, 32లక్షలమంది జనాభాకు తాగునీరు అందించేలా పనులు చేపట్టారు. 2006 జూన్ 5న మదనపల్లెలో రెండో దశ పనులకు మహానేత వైఎస్సార్ పైలాన్ ఆవిష్కరించారు.

3.86 టీఎంసీలు తరలించిన జగన్

జిల్లాకు 3.8618 టిఎంసీల కృష్ణా జలాలు తరలించిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిది. వచ్చే అక్టోబర్‌లో చంద్రబాబు నియోజకవర్గం కుప్పంకు కృష్ణా జలాలను తరలించేలా ప్రభుత్వం కుప్పం కాలువ పనులను ముమ్మరం చేసింది.

- వైఎస్.జగన్ సీఎం అయ్యాక జలవనరుల అభివృద్ధికి వేలకోట్లు ఖర్చు చేస్తున్నారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు చెందిన పుంగనూరు ఉపకాలువను 300 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యాన్ని 1,180 క్యూసెక్కులకు పెంచారు. కాలువ విస్తరణకు రూ.1,912 కోట్లు మంజూరు చేయగా టెండర్లు పూర్తయ్యాక రూ. 1,217.49 కోట్లతో కాంట్రాక్టర్ ఒప్పందం జరిగింది.
- వైఎస్సార్‌జిల్లాలోని గండికోట రిజర్వాయర్ నుంచి అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గానికి కృష్ణానీటిని తరలించేందుకు హంద్రీనీవా..., గాలేరు–నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుల అనుసంధానం పనులు సాగుతున్నాయి. రూ.4,373.23 కోట్లతో చేపట్టిన పనుల్లో రూ.1,220 కోట్ల పనులు పూర్తి చేశారు.

కొత్తగా 3 రిజర్వాయర్లు

ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలం ముదివేడు సమీపంలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి రూ.759.50 కోట్లు, పుంగనూరు మండలంలోని నేతికుంటపల్లె సమీపంలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి రూ. 717.80కోట్లు, సోమల మండలంలోని ఆవులపల్లె సమీపంలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి రూ.667.20కోట్లు మంజూరు చేశారు. టీడీపీ నేతలు కుట్రలతో పనులను అడ్డుకుంటున్నారు.

5.5 టీఎంసీల తాగునీటి ప్రాజెక్టుగా..

1989–94 మధ్యలో కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్టు కోసం నామమాత్రంగానైనా రూ.34,13,872 ఖర్చు చేశారు.1995లో సీఎం అయిన చంద్రబాబు హంద్రీ–నీవాపై చిన్నచూపు చూశారు. బడ్జెట్‌లో ఏటా రూ.10 కోట్లలోపే నిధుల కేటాయింపు చేశారు. ఈ నిధులు ప్రాజెక్టులో పనిచేస్తున్న అధికార,సిబ్బంది వేతనాలు, సర్వే, రీసర్వేలకే సరిపోయేది. రూ.1,478కోట్ల ప్రాజెక్టుకు కనీస నిధులు కేటాయింపు లేక పనుల్లో ఒక్క అడుగు ముందుకు పడలేదు. అయితే ఈ ప్రాజెక్టును భూస్థాపితం చేయాలన్న నిర్ణయానికి వచ్చేశారు. కరువురైతు నోట్లో మట్టికొట్టేలా హంద్రీ–నీవా ప్రాజెక్టును రూ.755 కోట్లతో 5.5 టీఎంసీలతో తాగునీటి పథకంగా మార్చి పాలనాపరమైన అనుమతి ఇచ్చారు.తొలివిడత పనులకు రూ.63.40కోట్లు మంజూరు చేశారు. ఈ చర్యపై కర్షకుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చినా అనాడు చంద్రబాబు పట్టించుకోకపోవడం గమనార్హం.

క్లుప్తంగా

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్



పట్టుకున్న మద్యం ప్యాకెట్లు, నిందితుడితో ఎస్‌ఐ, పోలీసులు

నిమ్మనపల్లె : కర్ణాటక మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం మండల పరిధిలోని కొండయ్యగారిపల్లె పంచాయతీ గుడ్రెడ్డిగారిపల్లెకు చెందిన రంగనాథ్(26) స్థానికంగా కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 132 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బండి బోల్తా.. రైతుకు గాయాలు



గాయపడిన నరసింహులు

ములకలచెరువు : ఎద్దుల బండి బోల్తా పడటంతో రైతుకు గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పర్తికోటకు చెందిన రైతు నరసింహులు(60) గురువారం ఉదయం తన ఎద్దుల బండిపై పొలం వద్దకు వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని చూసి ఎద్దులు భయంతో పరుగులు పెట్టాయి. దీంతో బండి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రైతు నరసింహులుకు గాయాలు అయ్యాయి. కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆటలకు పెద్దపీట

- సరదాగా, సందడిగా .. 'ఆడుదాం ఆంధ్ర'
- సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి క్రీడా సంబరాలు
- విజేతలకు రూ.5 లక్షల వరకు బహుమతులు
- జిల్లాలో 501 సచివాలయాల పరిధిలో ఏర్పాట్లు



బీటీ కాలేజీ మైదానంలో హాకీ ఆడుతున్న క్రీడాకారులు(ఫైల్)

మదనపల్లె సిటీ : రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. పాఠశాలలను మనబడి నాడు–నేడు పేరుతో అభివృద్ధి చేయడమే కాకుండా, విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోంది. లెర్న్ ఏ వర్డ్ ఏ డే, తర్ల్, టీచింగ్ టూల్, డిజిటల్ ఎడ్యుకేషన్, ప్రతి విద్యార్థికి ఆంగ్ల విద్య, ప్రాథమిక స్థాయి నుంచే టోఫెల్ తదితర వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది. యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో ఆటల పోటీలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున ప్రారంభం కానున్న క్రీడా పోటీలకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో 501 సచివాలయ పరిధిలో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. 46 రోజుల పాటు నిర్వహించే క్రీడా సంబరాల్లో యువతను పెద్ద ఎత్తున ప్రోత్సహించనున్నారు.

యువతను ప్రోత్సహించేందుకు...

ప్రస్తుత విద్యా సంవత్సరంలో 'ఆడుదాం ఆంధ్ర' టోర్నమెంట్‌ను భారీ స్థాయిలో నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేందుకు యువతను ప్రోత్సహించడం, జీవన నాణ్యతను మెరుగుపరచడానికి గల మార్గాలపై అవగాహన కల్పించడం దీని ప్రధాన ఉద్దేశం. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఈ పోటీలను నిర్వహిస్తారు. పురుషులకు, మహిళలకు విడివిడిగా క్రికెట్, బ్యాడ్మింటన్, హాకీ, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఆటల పోటీలను నిర్వహిస్తారు. నాన్ కాంపిటేటివ్‌లో భాగంగా యోగ, టెన్నికాయిట్, మారథాన్, ఆయా గ్రామాల్లోని సంప్రదాయ క్రీడల్లో కూడా పోటీలు నిర్వహిస్తారు. స్టేట్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ (శాప్) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలకు ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో రూ.44.52 కోట్లను మంజూరు చేసింది.

పోటీల నిర్వహణకు కమిటీలు

పోటీల నిర్వహణకు వివిధ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామ/సచివాలయ స్థాయిలో పోటీల నిర్వహణకు తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, పంచాయతీ విస్తరణాధికారి, ఏఈ, డీఈ, పంచాయతీ కార్యదర్శి, క్రీడా పోటీలు నిర్వహించే హెచ్‌ఎంతో గ్రామ సచివాలయ, మండల, నియోజకవర్గ కమిటీలు ఏర్పాటు చేస్తారు. జిల్లా స్థాయిలో డీఈవో, డీఆర్‌డీఏ పీడీ, యువజన సర్వీసుల సీఈవో, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి, జెడ్పీ సీఈఓ తదితర అధికారులతో జిల్లా కమిటీని ఏర్పాటు చేస్తారు. 'ఆడుదాం ఆంధ్ర' టోర్నమెంట్‌లో నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ప్రైజ్‌మనీ అందజేస్తారు.

గ్రామ/వార్డు స్థాయి నుంచి...

పోటీలను ముందుగా గ్రామ, పట్టణాల్లోని వార్డు స్థాయి నుంచి నిర్వహిస్తారు. తర్వాత మండల, పట్టణ, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహిస్తారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు విజేతలకు క్రీడా పరికరాలు, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారు. వాలీబాల్ జట్టులో ఆరు నుంచి 12, కబడ్డీ జట్టులో 7 నుంచి 12 మంది, ఖోఖో జట్టులో 9 నుంచి 12, క్రికెట్ జట్టులో 11 నుంచి 16, బ్యాడ్మింటన్ జట్టులో ఇద్దరు వంతున క్రీడాకారులు ఉంటారు.

విజేతలకు నగదు బహుమతులు

పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ విజేతలకు నియోజకవర్గ స్థాయిలో రూ.20 వేలు, రూ.10 వేలు వరుసగా ప్రథమ, ద్వితీయ, జిల్లా స్థాయిలో రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలను వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి అందిస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలకు రూ.లక్ష (ప్రథమ), రూ.50 వేలు (ద్వితీయ), రూ.30 వేలు(తృతీయ) బహుమతులు అందజేస్తారు.

ప్రణాళికాబద్ధంగా నిర్వహణ



కలెక్టర్ గిరీషా పర్యవేక్షణలో ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌ను ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. అక్టోబర్ 2న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారు. ఆసక్తి గల క్రీడాకారులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. ఈ పోటీల ద్వారా ఉత్తమ క్రీడాకారుల తయారవ్వడమే కాక క్రీడాకారుల్లో ప్రతిభ బయటపడుతుంది.

– షేక్ షఫీ, డీఎస్‌డీఓ, రాయచోటి

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



పిల్లలకు రూ.లక్ష అందిస్తున్న జయచంద్రారెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

బి.కొత్తకోట : మండలంలోని గుట్టపాళ్యంకు చెందిన మంజునాథరెడ్డి ఆత్మహత్యకు పాల్పడటంతో నలుగురు బిడ్డలు అనాథలైన కథనం సాక్షిలో ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ములకలచెరువు మండలం కదిరినాధునికోటకు చెందిన ఎన్నారై జయచంద్రారెడ్డి గురువారం గుట్టపాళ్యంకు వచ్చి తన వంతుగా రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని మంజునాథ్‌రెడ్డి పిల్లలకు అందించారు. వారితో మాట్లాడి చదువుకునేందుకు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచు జయరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రామసుబ్బారెడ్డి, మాజీ సర్పంచు మస్తాన్‌రెడ్డి, మార్కిరి ఆంజనేయరెడ్డి, రవిచంద్రారెడ్డి, దాదం లోకనాథరెడ్డి, హరినాథ్‌రెడ్డి, శివారెడ్డి, బయ్యారెడ్డి పాల్గొన్నారు.

మహిళకు నగదు అప్పగింత

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని తాళ్లమాపురం గ్రామానికి చెందిన వెంకటసుబ్బమ్మ గురువారం ప్రొద్దుటూరు పట్టణంలోని ఒక బ్యాంకుకు వెళ్లింది. బ్యాంకులో రూ.50 వేలు నగదు డ్రా చేసుకుంది. అయితే నగదును బ్యాంకులోనే మరచిపోయి వెళ్లిపోయింది. తర్వాత వెళ్లి చూసుకోగా అక్కడ డబ్బు కనిపించలేదు. దీంతో ఆమె టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. సీఐ ఇబ్రహీం బ్యాంకు అధికారుల ద్వారా సీసీ కెమెరాల్లో పరిశీలించి రూ.50 వేలను మహిళకు అందజేశారు. సీఐకి మహిళ కృతజ్ఞతలు తెలిపింది.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

చింతకొమ్మదిన్నె : వృద్ధురాలి హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని ఆజాద్‌నగర్‌లో రాధమ్మ(57) ఇటీవల హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు విచారణ చేపట్టి భగత్‌సింగ్ నగర్‌కు చెందిన మంజుల రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్‌ఐ భూమా అరుణ్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. రాధమ్మ(57) జీవనోపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లి అక్కడ షేక్ రహమతుల్లా అనే వ్యక్తిని వివాహం చేసుకుని, తన పేరును అమీనాగా మార్చుకుని కువైట్ నుంచి వచ్చి ఒంటరిగా భగత్‌సింగ్‌లో నివాసం ఉంటూ వడ్డీ వ్యాపారం చేస్తుండేది. ఆమెతో కొన్ని రోజుల నుంచి మంజుల రాజ్‌కుమార్ పరిచయం ఏర్పరుచుకుని చనువుగా ఉండేవాడు. ఆజాద్ నగర్ సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో మరో ఇంటిని అద్దెకు తీసుకుని అక్కడికి వెళ్లి ఆమెకు స్కూటీ నేర్పించే వాడని విచారణలో వెల్లడైంది. ఈ క్రమంలో తన కోరిక తీర్చాలనడంతో నిరాకరించింది. దీంతో ఆమె తలపై బండరాయితో అతను కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. సమగ్రంగా దర్యాప్తు చేసి భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన మంజుల రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని ద్విచక్రవాహనంతోపాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించిన రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐ అరుణ్‌రెడ్డితోపాటు కానిస్టేబుళ్లను డీఎస్పీ షరీఫ్ అభినందించారు.

బాబు రౌడీలను పెట్టుకుని షో చేస్తున్నాడు

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు : వీధి రౌడీలను పక్కన పెట్టుకుని చంద్రబాబు షో చేస్తున్నాడని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. 45 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందంటూ చెప్పుకుంటూ, 14 ఏళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు ఏరోజు పులివెందుల వైపు కనీసం కన్నెత్తి కూడా చూడలేదన్నారు. అలాంటిది ఈ రోజు నలుగురు వీధిరౌడీలను పక్కనపెట్టుకుని నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడని విమర్శించారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగినప్పుడు రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉందని, ఆ రోజు ఎందుకు హత్య జరగకుండా రక్షణ కల్పించలేకపోయారని ప్రశ్నించారు. మీరు అధికారంలో ఉండి, నీకు సంబంధించిన వీధి రౌడీలే వివేకానందరెడ్డిపై హత్యకు పాల్పడ్డారని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. పనులు కూడా వేగవంతంగా చేపట్టారన్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఒక్క ప్రాజెక్ట్ కూడా ప్రారంభించిన పాపాన పోలేదన్నారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టడం, పోతిరెడ్డిపాడును విస్తరించాలని తలపెడితే, చంద్రబాబు మాత్రం పోతిరెడ్డిపాడు విస్తరిస్తే కోస్తాకు నీరు రావని ప్రచారం చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పులివెందులను అన్ని విధాలుగా, ఇండస్ట్రీ పరంగా, విద్య పరంగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారన్నారు. గతంలో పులివెందులలో గ్యాంబ్లింగ్ చేసి బీటెక్ రవి అడ్డగోలుగా గెలిచిన గెలుపు ఒక గెలుపా, దమ్ముంటే స్వచ్ఛందంగా గెలిచి నిరూపించుకో అని సవాల్ విసిరారు. కేవలం అసత్య ప్రచారం చేయడానికే ఈ యాత్రను సంకల్పించారని ఈ రాష్ట్ర ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. ప్రాజెక్టుల ద్వారా నీరు సరఫరా చేసే విషయం తెలియదు కానీ, తక్కువ రేటుకు మద్యం సరఫరా చేస్తానని చెప్పుకుంటున్నాడంటే చంద్రబాబుకు మతిస్థిమితం లేకుండా ఉన్నాడనే దానికి ఇంతకన్నా నిదర్శనం ఏముందన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, అధ్యాపకులు

మదనపల్లె సిటీ : విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మదనపల్లె మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజరెడ్డి అన్నారు. గురువారం స్థానిక చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో రీజనల్ అథ్లెటిక్స్ మీట్–23 ప్రారంభమైంది. మొదట మైదానంలో క్రీడా జ్యోతిని మున్సిపల్ చైర్మన్ ప్రిన్సిపాల్‌లతో కలిసి వెలిగించారు. పాల్గొన్న క్రీడాకారులతో గౌరవ వందనం జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.గోవిందరావు, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, వెంకటరమణ, వలసపల్లి సర్పంచు నాగరాజరెడ్డి, విద్యాలయ అధ్యాపకులు, పీడీలు పాల్గొన్నారు. ఈ క్రీడలు 5వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ప్రారంభమైన క్రీడలు

రీజనల్ అథ్లెటిక్స్ మీట్ అట్టహాసంగా ప్రారంభమైంది. బాలురు, బాలికలకు అండర్–17,–19 రన్నింగ్‌లో 100 మీటర్ల పోటీలు జరిగాయి. క్రీడల్లో యానం, కొట్టాయం, కొప్పల్, కరీంనగర్, కన్నూర్, చామరాజ్‌నగర్, బెల్గామ్, అండమాన్, చిత్తూరు క్లస్టర్ల విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు ఉత్పాదక సంఘాలతో లాభాలు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : రైతు ఉత్పాదక సంఘాలతో అధికంగా లాభాలు వస్తాయని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని శెట్టిగుంట గ్రామం రైతు భరోసా కేంద్రంలో కలికిరి కేవీకే ఆధ్వర్యంలో మామిడి పంటలో మేలైన యాజమాన్య పద్ధతిపై రైతులకు గురువారం శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఉత్పాదక సంఘాలు సంఘటితంగా ఉండడం వల్ల ఏదైనా సాధించవచ్చని తెలిపారు. రైతులే యజమానిగా, వాటాదారులుగా ఉంటే ఆ సంఘాలలో ఆదాయం రెట్టింపు అవుతుందని తెలిపారు. సంఘాలు ఎఫ్‌సీఓల ద్వారా మందులు, ఎరువులు, విత్తనాలు తెచ్చుకొంటే ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా చర్యలు తీసుకొంటామని తెలిపారు. మార్కెటింగ్‌కు సౌకర్యాలు, వసతులు ఏర్పాటు చేయడం వల్ల ఎగుమతులలో ఆర్థిక పురోగతి పెరుగుతుందని తెలిపారు. అలాగే అరటి, బొప్పాయి, మామిడి ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం వైఎస్సార్ ఉద్యాన కళాశాల సీనియర్ శాస్త్రవేత్త శ్రీధర్ ఆధ్వర్యంలో మామిడి రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యకమంలో సీఆర్ఎస్ శాస్త్రవేత్త రాజశేఖరం, నిపుణులు పీరూసాహెబ్, శ్రీనివాసులు, జెడ్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ షఫీ, వీహెచ్ఓ శిరీషీ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి సాగును పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలని రైతు సాధికార సంస్థ రాష్ట్ర రీసోర్స్‌పర్సన్ రాజేశ్వర్ పేర్కొన్నారు. గురువారం కడపలోని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఆగస్టు నెలలో నిర్వహించవలసిన కార్యాచరణపై సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మాస్టర్ ట్రైనర్ల పరిధిలో జరిగే పొలంబడికి హాజరవుతూ.. పొలం చుట్టూ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను తయారు చేయాలన్నారు. అదే విధంగా పురుగు, తెగుళ్లపైన ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతూ రైతులు నష్టపోకుండా కషాయాలు, ద్రావణాలను అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులకు ఎస్సీ కార్పొరేషన్ నుంచి సీడ్ కిట్స్ అందే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి కిచెన్ గార్డెన్ తప్పని సరిగా ఉండే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, డీపీఎంయూ సిబ్బంది పాల్గొన్నారు.

వరద పీడిత గ్రామాల్లో వేగంగా ఇళ్ల నిర్మాణం

జేసీ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్



రాజంపేట : పులపత్తూరులో బాధితులతో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాజంపేట : వరద పీడిత గ్రామాల్లో వేగవంతంగా పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టరు ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్ ఆదేశించారు. గురువారం పులపత్తూరు గ్రామంలో జరుగుతున్న పక్కా ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పక్కా ఇళ్లను త్వరితగతిన నిర్మించి బాధితులకు అందజేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాధితులు సబ్‌కలెక్టర్ దృష్టికి ఇళ్ల నిర్మాణంలోని సమస్యలను తీసుకెళ్లారు. వీటిని జిల్లా కలెక్టరుకు నివేదిస్తామని ఆయన తెలిపారు. జేసీ వెంట రాజంపేట ఆర్డీవో రామకృష్ణారెడ్డి, పులపత్తూరు సర్పంచి జగన్‌రెడ్డి, హౌసింగ్ ఈఈ కుప్పుస్వామి, డీఈ మురళీ, ఆర్డీవో సీసీ కిరణ్, వర్క్ ఇన్‌స్పెక్టరు పాల్గొన్నారు.

కడప–రేణిగుంట హైవే భూసేకరణపై సమీక్ష

కడప–రేణిగుంట నేషనల్ హైవే (నూతనంగా నిర్మించబోయే)కు సంబంధించి భూసేకరణలో పరిహారం చెల్లింపులు, తదితర అంశాలపై జేసీ అహమ్మద్‌ఖాన్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో నందలూరు, రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు తహసీల్దార్లు పాల్గొన్నారు.

పరిహారం పంపిణీ పూర్తి చేయాలి

రాయచోటి : జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి నిర్వాసితులకు భూ పరిహారం పంపిణీ వేగంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో పరిహారం చెల్లింపు, పెండింగ్ భూసేకరణ అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎన్‌హెచ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్ 716 కడప నుంచి రేణిగుంట జాతీయ రహదారికి సంబంధించి మొత్తం భూసేకరణ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో రాయచోటి, మదనపల్లి, ఆర్డీఓలు రంగస్వామి, మురళీ, ఎన్‌హెచ్ అధికారులు, డీటీలు, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీ పరిశీలన

ఓబులవారిపల్లె : మంగంపేట, కాపుపల్లి, దళితవాడ, అరుంధతివాడ గ్రామస్తుల పునరావాస కల్పన కోసం లే అవుట్లు, గృహ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ పేర్కొన్నారు. మంగంపేట ఆర్‌ఆర్–5 పునరావాస కాలనీలో లే అవుట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన పునరావాసం కల్పించేందుకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. లే అవుట్లు, రోడ్లు తదితర అంశాలకు సంబంధించి హౌసింగ్ డీఈ కుప్పుస్వామి మ్యాప్ ద్వారా జేసీకి వివరించారు. అనంతరం ఏపీఎండీసీ, రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఓ సుదర్శన్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, ఏపీఎండీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ దుర్మరణం

తంబళ్లపల్లె : ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ దుర్మరణం చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రెడ్డికోటకు చెందిన వినోద్(24) ట్రాక్టర్ నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. బుధవారం బాడుగకు ట్రాక్టర్ తీసుకు వెళ్లిన వినోద్ పని ముగించుకుని తిరిగి రాత్రి ఇంటికి వస్తుండగా కుమ్మరపల్లె సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఆయన ట్రాక్టర్ ఇంజిన్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తెల్లవారుజామున రోడ్డులో వెళ్తున్న వారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు. వినోద్‌కు రెండు నెలల క్రితమే వివాహం అయింది. కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.



బోల్తా పడిన ట్రాక్టర్



వినోద్ మృతదేహం